సాక్షి సూర్యాపేట

ఆదివారం । 21 । మే । 2023



ముగ్గురి అరెస్ట్

గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కొంత సరుకును స్వాధీనపర్చుకున్నారు. - 8లో



తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా..

తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
42° / 28°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పూట సూర్యరశ్మి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడా మైదానాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

సూర్యాపేటటౌన్ : క్రీడా మైదానాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సీఎం కప్ నిర్వహణలో భాగంగా ఈ నెల 22 నుంచి 24 వరకు జరగనున్న జిల్లా స్థాయి ఆటల పోటీల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదీ లోపు క్రీడా కారులు స్థానిక జూనియర్ కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్ బాల్ ఇతర క్రీడలు, ఎస్వీ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్, పబ్లిక్ క్లబ్ లో బ్యాడ్మింటన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వెంకటనారాయణగౌడ్

సూర్యాపేటటౌన్ : జిల్లాలో ఆయిల్ పామ్, కొబ్బరి తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని జెడ్పీ వైస్ చైర్మన్, 3వ స్థాయీ సంఘం చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో 3 వ స్థాయీ సంఘం (వ్యవసాయం) సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించే చేపల ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్,కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే .జానీమియా , జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూర్ (ఎస్) : ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలు వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారి సుందరి కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం నశింపేట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన చెరువు పూడికతీత పనులను తనిఖీ చేసి మాట్లాడారు. వీరి వెంట ఏపీఓ ఈశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిషోర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న అఖిలపక్షాల నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో అఖిలపక్షాల పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులపై తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, 24 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరిలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే 24 గంటల్లో స్థానిక తెలంగాణ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ముందు క్షమాపణ చెప్పకుంటే ఈ నెల 24వ తేదీన పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుకూరి సోమయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, వైఎస్‌ఆర్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోమన్న, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రయ్య, సైదులు, సునీల్, నరేష్, లింగయ్య, కృష్ణ, రమేష్, యాదగిరి, తిరుపతి, రాంబాబు, యుగేందర్ పాల్గొన్నారు.

● ఆకట్టుకుంటున్న పల్లె చిత్రాలు

సూర్యాపేటలోని ఫ్లైఓవర్ గోడలపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ పండుగలు, పల్లెటూరి వాతావరణం ఉట్టి పట్టేలా ఉన్న చిత్రాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో భాగంగా కొత్త బస్టాండ్, ఖమ్మం క్రాస్ రోడ్ చౌరస్తాలో ఉన్న అండర్ పాస్ గోడలపై ఈ పెయింటింగ్స్ వేయించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట









గాలివాన బీభత్సం



నాగారంబంగ్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి మృతిచెందిన కోడిపిల్లలు

- కూలిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- నాగారం బంగ్లాలో మూడు కోళ్ల ఫాంలలో 1500పైగా కోడిపిల్లలు మృతి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

నాగారం, తుంగతుర్తి, నూతనకల్: జిల్లాలో పలుచోట్ల శనివారం సాయంత్రం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. నాగారం మండల కేంద్రంలోని సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసి హైవే హోర్డింగ్ (సూచిక బోర్డు) రోడ్డుపై కులిపోయింది. దీంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి దాదాపు సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న సీఐ రాజేష్, ఎస్‌ఐ ముత్తయ్యలు సంఘటన స్థలానికి వచ్చి స్థానికులు, పోలీసు సిబ్బందితో కలిసి జేసీబీ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న హోర్డింగ్‌ను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



నాగారంలో జాతీయ రహదారిపై కూలిన హోర్డింగ్‌ను తొలగిస్తున్న పోలీసులు

అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్లు విరిగి పడగా, మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరడగంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఒక్కో షెడ్‌లో 500పైగా కోడిపిల్లలు

నాగారంబంగ్లాలో మూడు కోళ్ల ఫాంలలో సుమారు 1500పైగా కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. నాగారంబంగ్లాకు చెందిన దోమల బాలమల్లు, కన్నెబోయిన మల్లేష్, కన్నెబోయిన అవిలయ్యలకు చెందిన మూడు కోళ్లఫాంలలో ఈదురు గాలులకు షెడ్లపైపై కప్పులు లేచిపోవడంతో వర్షానికి ఒక్కో షెడ్‌లో 500పైగా కోడిపిల్లలు మృతి చెందాయి. మృతిచెందిన కోడి పిల్లల విలువ సుమారు రూ.12లక్షలకుపైగా ఉంటుందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. నూతనకల్ మండలంలో వడగళ్ల వర్షం కురిసింది. బిక్కుమళ్ల, మాచనపల్లి గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. ఈదురు గాలులకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు లేచిపోయాయి. తుంగతుర్తి మండలంలో ఈదురు



కాశీతండాలో ఈదురు గాలులకు కూలిన ఇల్లు

గాలులకు విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. కాశీతండాలో గుగులోతు విమలకు చెందిన ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. తిరుమలగిరిలో మార్కెట్లో ధాన్యం తడిసింది.

ఆరు మండలాల్లో వర్షం

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని ఆరు మండలాల్లో శనివారం వర్షం కురిసింది. మధ్యాహ్నం 3గంటల నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. నాగారంలో 55.8 మిల్లీ మీటర్లు, జాజిరెడ్డిగూడెంలో 33.3, తిరుమలగిరిలో 16.0, నూతనకల్‌లో 9.8, మద్దిరాలలో 3.0, ఆత్మకూర్‌లో 1.0 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది.

వడగళ్ల వర్షం



అర్వపల్లి: అర్వపల్లితోపాటు మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. మళ్లీ కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడిసింది. మామిడి తోటలకు అక్కడక్కడ ఉన్న కాయలు రాలిపోయాయి. కాసర్లపహాడ్‌లో మెండె సురేష్‌కు చెందిన ఐదు ఎకరాల డ్రాగన్‌ఫ్రూట్ తోట ధ్వంసమైంది. అలాగే పలు ఇళ్ల రేకులు, గుడిసెలు గాలికి కొట్టుకుపోయాయి.

కుక్కడంలో రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలి..

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. కుక్కడం నుంచి రాజగాని తండాకు వెళ్లే మట్టి రోడ్డుకు అడ్డంగా తుమ్మ చెట్టు కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఓరైతు చెలకలో పెద్ద సర్కారు తుమ్మ చెట్టు కూలి గేదెల మీద పడింది. ఇళ్లలో ఉన్న చెట్లు సైతం కూలిపోయాయి.



కుక్కడం-రాజగాని తండాకు వెళ్లేదారికి అడ్డంగా కూలిన తుమ్మ చెట్టు

యువత క్రీడల్లో రాణించాలి



నాగారంలో క్రీడాసామగ్రిని బహూకరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- మంత్రి జగదీశ్ రెడ్డి

నాగారం : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎస్–ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీతాంజలి, అంబేడ్కర్, క్రాంతి యువజన సంఘాల క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ ఆటలకు సంబంధించిన క్రీడాసామగ్రిని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడాకారులు క్రీడాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, చిప్పలపల్లి సోమయ్య, కూరం వెంకన్న, దేవరకొండ మురళీ, కన్నెబోయిన భద్రయ్య, రాములు, మల్లేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేశంలో ప్రధాన పార్టీగా బీఆర్‌ఎస్

సూర్యాపేట : లోక్ సభ ఎన్నికల నాటికి దేశంలో బీఆర్‌ఎస్ ప్రధాన పార్టీగా ఆవిర్భవిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి చెప్పారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విజన్ ఉన్న నాయకుడిగా దేశ ప్రజల్లో సీఎం కేసీఆర్‌కు ఎనలేని ఆదరణ ఉందన్నారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీ సృష్టించిన ప్రకంపనలు హస్తినకు తాకుతున్నాయన్నారు. ఎత్తుగడలో భాగంగానే కర్ణాటక ఎన్నికలకు బీఆర్‌ఎస్ దూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ పోటీలో లేకపోవడమే అక్కడ కాంగ్రెస్ గెలుపునకు దోహదపడిన అంశాన్ని విస్మరించరాదని తెలిపారు.



మంత్రిని కలిసిన వీఆర్‌ఏలు

మంత్రి జగదీశ్ రెడ్డికి వీఆర్‌ఏల కృతజ్ఞతలు

వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై సూర్యాపేట జిల్లా వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని శనివారం క్యాంపు ఆఫీస్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల సునీల్ గవాస్కర్, వీఆర్‌ఏల జాక్ జిల్లా చైర్మన్ గోరుగంటి మధుసూదన్ రావు, జాక్ కో చైర్మన్ మామిడి సైదులు, కాసాని వెంకన్న, ఆదిత్య, రాధాకృష్ణ, సందయ్య, నజీర్, సతీష్, నాగేశ్వర రావు, రమ, సైదులు, ముత్తయ్య, వీఆర్‌ఏలు నగేష్, శ్రీనివాస్, జహంగీర్, మాధవి, నస్రీన్ ఉన్నారు.

ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించాలని కలెక్టర్ యస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, కేంద్రాల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ యస్. మోహన్‌రావుతో కలసి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2 లక్షల 84 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో రోజువారీగా నమోదు చేసి రైతులకు సత్వర చెల్లింపులు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంకా 232 కొనసాగుతున్నాయని , 64 కేంద్రాలు మూసి వేసినట్లు తెలిపారు. లారీ కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ రూపంలో ముందుగా నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆత్మకూరు, మోతె, జాజిరెడ్డి గూడెం, తిరుమలగిరి, నాగారం, మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి మండలాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు సత్వరమే తరలించాలని, లారీల కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఎం రాంపతి, డీఎంఓ సంతోష్, డీఏఓ రామారావు నాయక్, డీఎస్ఓ పుల్లయ్య, లారీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

ఆటోనగర్ ఏర్పాటుకు భూములు పరిశీలిస్తున్నాం

సూర్యాపేట రూరల్: జిల్లా అభివృద్ధిలో భాగంగా ఆటోనగర్ ఏర్పాటుకు అనుకూలమైన ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ వెంకట్రావు చెప్పారు. శనివారం సూర్యాపేట మండలం బాలెంల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 441లో, చివ్వెంల మండలం ఐలాపురంలోని సర్వే నంబర్ 169లో, ఇమాంపేటలోని సర్వే నంబర్146లో గల ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లా దినదినాభివృద్ధి చెందుతున్నందున మరింత వేగంగా పారిశ్రామిక రంగాన్ని కూడా అభివృద్ధి చేసేలా ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి సర్కారు భూములను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. నీటి వనరులు, భూముల అనుకూలత తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆటో నగర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో మలవిసర్జన ద్వారా తయారు చేసే ఎరువుల కేంద్రాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ల్యాండ్ రికార్డ్స్ ఏడీ నాగేందర్, పరిశ్రమలశాఖ జీఎం తిరుపతయ్య, తహసీల్దార్ వెంకన్న, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టుల్లో సిబ్బందిని నియమిస్తాం



హుజూర్‌నగర్ కోర్టులో గదులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



కోదాడ కోర్టును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

హుజూర్‌నగర్: జిల్లాలోని కోర్టుల్లో సిబ్బందిని నియమిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ తెలిపారు. శనివారం హుజూర్‌నగర్ కోర్టు భవనాన్ని పరిశీలించి అనంతరం సమావేశంలో మాట్లాడారు. జూన్ మొదటి వారంలో అదనపు జిల్లా కోర్టు ప్రారంభ మవుతుందన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జడ్జిని సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాముల రామిరెడ్డి, జక్కుల నాగేశ్వర రావు, పీఆర్‌ఓ కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు శ్రీనివాస రావు, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, కృష్ణయ్య, రవికుమార్, బాలకృష్ణ, రమాదేవి, అంజయ్య, నరసింహారావు, చంద్రయ్య, ఆర్డీఓ వెంకారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ, ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కోదాడ కోర్టు భవన నిర్మాణానికి సహకరిస్తా

కోదాడ: కోదాడకోర్టు భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ అన్నారు. శనివారం కోదాడ జూనియర్ సివిల్ కోర్టును ఆయన పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అనుమతులు మంజూరైనందున త్వరలోనే శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని బార్‌అసోసియేషన్‌కు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, శరత్‌బాబు, కృష్ణయ్య, శ్రీనివాస్‌నాయుడు, గట్ల నరసింహారావు, చింతకుంట్ల రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, షాషు, సీతారామరాజు, పవన్, శ్రీధర్, మల్లిఖార్జున్, చలం, హేమలత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : 2023–24 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి మార్చి -23లో పదో తరగతి ఉతీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి దయానందరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ , పీహెచ్‌సీ విద్యార్థులు ఈ నెల 22 నుంచి జూన్ 3 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. జీపీఏ 7.0 ఆ పైన సాధించిన విద్యార్థులు ధ్రువ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

వేడుకగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయబద్ధంగా నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఇక ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన వంటి పూజలు జరిపించారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్య కల్యాణం జరిపారు. వేడుకగా నిర్వహించిన నిత్య కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం జోడు సేవోత్సవం వంటి పూజలు చేశారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ద్వార బంధనం చేశారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

రేషన్ డీలర్ల సమ్మెబాట

- 22న పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చలు జరపనున్న డీలర్లు
- సానుకూల ప్రకటన రాకపోతే వచ్చే నెల 5 నుంచి సమ్మెకు సిద్ధం
- ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీసు అందజేత
- రేషన్ పంపిణీపై ప్రభావం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పౌర సరఫరాల శాఖలో క్రియాశీలకంగా పనిచేసే రేషన్ డీలర్లు తమ సమస్యల పరిష్కారానికి సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలా రోజులుగా పోరాడుతున్నా ఎలాంటి పరిష్కారం లభించలేదు. గతంలోనే సమ్మెబాట చేపట్టాలని డీలర్లు నిర్ణయించుకోగా.. డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని సమ్మె చేయొద్దని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరడంతో విరమించుకున్నారు. కానీ ఇప్పటికీ ఎలాంటి పరిష్కారం లేకపోవడంతో ఈసారి కచ్చితంగా సమ్మె చేయాలని రేషన్ డీలర్లు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22న సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చలు జరిపి, వారి నుంచి సానుకూల ప్రకటన రాకపోతే జూన్ 5 నుంచి సమ్మెకు సిద్ధం కావాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికే జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు అందించారు.



అరకొర కమిషన్

జాతీయ ఆహార భద్రత చట్టం 2015 అమలులోకి రాకముందు రేషన్ బియ్యం కిలోకు రూ.20 పైసల చొప్పున క్వింటాల్‌కు రూ.20 కమీషన్ వచ్చేది. అయితే చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఈ కమీషన్ రూ.70కి పెరిగింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.35, రాష్ట్ర ప్రభుత్వం రూ.35 చొప్పున చెల్లించాలి. 2015 అక్టోబర్ నుంచి 2018 ఆగస్టు వరకు ప్రభుత్వాల నుంచి డీలర్లకు కమీషన్ రావాల్సి ఉంది. గతంలో కమీషన్ బకాయిలు 25 శాతం మాత్రమే ఇచ్చారని రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. క్వింటాల్‌కు రూ.70 చెల్లించాల్సి ఉండగా.. కేవలం రూ.22.50 మాత్రమే ఇచ్చారని వాపోతున్నారు.

బకాయిలు చెల్లించాలి

"రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలి. బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. హెల్త్‌కార్డులు, గౌరవ వేతనం రూ.30 వేలు ఇవ్వాలి. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మె చేపడతాం.

– చక్రదరి నాగరాజు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇవీ డిమాండ్లు..

జిల్లా వ్యాప్తంగా 610 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా జిల్లాలో 3,25,471 కుటుంబాలకు ప్రతి నెలా సుమారు 9వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అందుతోంది. కాగా.. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని రేషన్ డీలర్లు అందరూ అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస గౌరవ వేతనం రూ.30 వేలు ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా డీలర్లకు రావాల్సిన రూ.416 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు. వీరు సమ్మెబాట పట్టనుండడంతో రేషన్ వినియోగదారులకు ఇక్కట్లు తప్పేలా లేవు.

క్లుప్తంగా

సిమెంట్ లారీ దగ్ధం



లారీలో ఎగిసిపడుతున్న మంటలు

మునగాల: సిమెంట్ లారీ క్యాబిన్‌లో ఆకస్మాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై మునగాల మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి కేసీపీ సిమెంట్ లోడుతో హైదరాబాద్ వైపు లారీ బయలుదేరింది. మార్గమధ్యలో మండలంలోని ఆకుపాముల వద్ద లారీ రేడియేటర్ బాయిల్ట్ అయి ఒక్కసారిగా మంటలు లేచి క్యాబిన్‌లోనికి ప్రవేశించాయి. వెంటనే డ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికిగ సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. కాగా, ఈ ప్రమాదం సంభవించిన సమయంలో జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్త్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కొళ్ల మహోత్సవ సంవాదాన్ని చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాభంధనం, రుత్విగ్వరణం,ˇ ,మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛరణాలతో వైభవంగా నిర్వహించారు.అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా శుక్రవారం రాత్రికే ఆలయానికి చేరుకున్న భక్తులు రాత్రి ఆలయంలో బస చేసి తెల్లవారుజామునే కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ,ఆంజనేయాచార్యులు, శేషగిరిరావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా..

- చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.32లక్షల విలువైన 52 తులాల బంగారం, 34 తులాల వెండి, 3బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ



సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.32లక్షల విలువైన 52తులాల బంగారం, 34 తులాల వెండి, మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏడుగురు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. నల్లగొండ టూటౌన్, సీసీఎస్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో ఈనెల 15న పానగల్ బైపాస్‌లో వాహనాల తనిఖీ చేపడుతుండగా అనుమానస్పందంగా ఉన్న వ్యక్తిని విచారించగా కనగల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రుద్రాక్ష శ్రీనుగా పోలీసులకు చెప్పాడు. అతన్ని విచారించగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. శ్రీనుకు తోడుగా కర్నూల్ జిల్లా కొత్తపేటకు చెందిన భాస్కర్‌రెడ్డి, నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎల్కపాటి అరుణ్, అలియాస్ ఆరులతో కలిసి చోరీలకు పాల్పడుతున్నాడు. శ్రీను ఇచ్చిన సమాచారంతో మిగతా ఇద్దరిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

చోరీ సొత్తు కొనుగోలు చేసిన వారిపై కేసు

చోరీ చేసిన సొత్తును నలుగురు వ్యక్తులకు విక్రయించడంతో కొనుగోలు చేసిన ఏపీలోని రాయచోటి జిల్లాలోని పొద్దుటూరుకు చెందిన ఆలమూరు సంజీవ్‌రెడ్డి , హైదరాబాద్‌కు చెందిన 6వ నంబర్ చౌరస్తా ప్రాంతానికి చెందిన కాలవల శ్రవణ్ అలియాస్ మున్నా, ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన గురుజాల ఉదయ్‌కిరణ్, అలియాస్ ఉదయ్, కర్నూల్ జిల్లా సున్నిపెంట ప్రాంతానికి చెందిన సాంద్రపాటి ప్రేమ్‌కుమార్‌లకు విక్రయించాడు. చట్ట విరుద్ధంగా దొంగల నుంచి సొత్తు కొనుగోలు చేసిన వారిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. రుద్రాక్ష శ్రీనుపై గతంలో పీడీ యాక్టులో జైల్‌కు వెళ్లి వచ్చాడని, 50కి పైగా వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. ఇటీవల నల్గొండ టూటౌన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో 5 కేసుల చొప్పున, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు ఇబ్రహీంపట్నం , మహబూబ్‌నగర్ టౌన్, కడప టౌన్, పోలీస్‌స్టేషన్లలో ఒక కేసు చొప్పున మొత్తం 18 కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసు పరిశోధనలో చాకచక్యంగా వ్యహరించిన టూటౌన్ సీఐ ప్రసాద్, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు మహేందర్, వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అజయ్, సైదులు, శంషుద్దీన్, శంకర్, బాలకోటి, విష్ణువర్ధన్ గిరి, రాంప్రసాద్, పాష, లింగారెడ్డి, కృష్ణలను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మహమ్మద్ మృతదేహం

కట్టంగూర్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ ముంబాయికి చెందిన మహమ్మద్ షోయబ్ (26) మూడేళ్లుగా హైదరాబాదులోని బంధువుల వద్ద ఉంటూ బట్టల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార నిమిత్తం శనివారం బైక్‌పై హైదరాబాదు నుంచి విజయవాడకు బయలుదేరాడు. మార్గమధ్యలోని రామోజీ ఫిలింసిటీ వద్ద పానుగంటి జయంరాం లిఫ్ట్ అడగ్గా బైక్ ఎక్కించుకొని విజయవాడకు బయలుదేరాడు. కట్టంగూర్ గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి హైవేకు ఎడమవైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై షోయబ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనక కూర్చున్న జయరాంకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువు వకీల్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

తిరుమలగిరిలో న్యాయవాదిపై దాడి



న్యాయవాదిని పరామర్శిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : గుర్తుతెలియని వ్యక్తులు ఓ న్యాయవాదిపై దాడి చేశారు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధి అనాంతరం గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు మండలం పర్రెపాడు గ్రామానికి చెందిన న్యాయవాది పర్రెపాటి యుగేంధర్ ఉదయం తిరుమలగిరిలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి కారులో హాజరయ్యాడు. అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా అనంతారం శివారులో దుండగులు దాడి చేశారు. కారు అద్దాలు ధ్వంసం చేశారు. యుగేంధర్ వెంటనే 100కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి హేయమైన చర్య

న్యాయవాదిపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య అన్నారు. శనివారం సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో యుగేంధర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారిపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు వై.నరేష్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్, ఎంపీటీసీ సభ్యుడు జమ్మిలాల్ తదితరులు ఉన్నారు.

అనాజిపురంలో విషాదఛాయలు

- రంగారెడ్డి జిల్లాలో భార్య గొంతుకోసి సూర్యాపేట జిల్లా వాసి ఆత్మహత్య
- తల్లిదండ్రుల మృతితో అనాథలైన ఇద్దరు చిన్నారులు
- అఘాయిత్యానికి అప్పుల బాధలే కారణమని బంధువుల వెల్లడి



నాగరాజు,సుధారాణి (ఫైల్)

పెన్‌పహాడ్ : అప్పులు తీర్చే మార్గం కనిపించగా సూర్యాపేట జిల్లా వాసి రంగారెడ్డి జిల్లాలో భార్య గొంతుకోసి ఆపై తానూ ఆత్మహత్య చేసుకోవడంతో స్వగ్రామం పెనపహాడ్ మండలం అనాజిపురంలో విషాదం అలుముకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన యర్కచర్ల హన్మయ్య–నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమారుడు శ్రీనివాస్ మూగవాడు. చిన్న కుమారుడు యర్కచర్ల నాగరాజు (38)కు విద్యాబుద్ధులు నేర్పించారు. గ్రామంలో ఆర్‌ఎంపీగా సేవలందిస్తూ జీవనం సాగించేవాడు. తొమ్మిది సంవత్సరాల క్రితం ఖాసీంపేట గ్రామానికి చెందిన సుధారాణి(32)ని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. పెద్దకుమారుడు నాని 3వ తరగతి, చిన్నకుమారుడు చెర్రి 2వ తరగతి చదువుతున్నారు.

ఐదేళ్ల క్రితం వలసెళ్లి..

కుటుంబ అవసరాల కోసం నాగరాజు గ్రామంలో చేసిన అప్పులు అధికం కావడంతో వాటిని తీర్చేందుకు ఐదేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాన్వాడకు కుటుంబంతో కలిసి వలసెళ్లాడు. అక్కడే ఆర్‌ఎంపీగా వైద్యసేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఊరిలో చేసిన అప్పులతో పాటు, పిల్లల చదువుతో పాటు కుటుంబ అవసరాలు పెరిగిపోయాయి. దీంతో అప్పులు తీర్చడానికి భార్యభర్తలు ఇబ్బందులు పడుతూ మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో నాగరాజు శనివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య సుధారాణి గొంతు కోసి హత్య చేసి ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. తెల్లవారుజామున చిన్నారులు నిద్రలేవగా అఘాయిత్యం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో చిన్నారులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అవసాన దశలో సాకుతారని ఆశపడిన తల్లిదండ్రుల ముందే కుమారుడు, కోడలు చనిపోవడంతో వృద్ధ దంపతుల రోదిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. కాగా, పోస్టుమార్టం అనంతరం శనివారం రాత్రి మృతదేహాలు స్వగ్రామానికి చేరుకున్నాయని, ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుల బంధువులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

హుజూర్‌నగర్: నియోజకవర్గంలోని మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో ఇటీవల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 370 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని, 1950 లీటర్ల బెల్ల పానకం ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి దాడుల వివరాలు వెల్లడించారు. మఠంపల్లి మండలం రామచంద్రాపురం తండాలో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి ఆంగోతు రంగా ఇంట్లో 300కేజీలు, ఆంగోతు శివ ఇంట్లో 70 కేజీల నల్లబెల్ల స్వాధీనం చేసుకున్నారు. ఆంగోతు శివను అరెస్ట్ చేశారు. అంగోతు రంగా, మంచ్యా తండాకు చెందిన బెల్లం సరఫరాదారు రూపావత్ రంగాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మేళ్లచెరువు మండలం వెల్లటూరు కాలనీలో దాడి చేసి 1,950 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు స్థానిక ఎక్సైజ్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన నల్లబెల్లం బస్తాలతో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది

తుంగతుర్తిలో అరాచక పాలన

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



యుగేంధర్‌ను పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట : తుంగతుర్తిలో అరాచక పాలన సాగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. శనివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల అనంతారం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దాడికి గురైన న్యాయవాది యుగేంధర్‌రావును సూర్యాపేట ఆస్పత్రిలో ఆయన పరామర్శించి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నియోజకవర్గ ప్రజల హక్కులను కాలరాస్తూ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో నాగారం మండలం పస్తాల గ్రామం వద్ద పాల్వాయి నగేష్ అనే వ్యక్తిని కూడా ఇదే తరహాలో ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేశారని తెలిపారు. కేసీఆర్ పాలనలో అరాచక పాలన నడుస్తుందని ఎమ్మెల్యే ఒక గుండాల ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యేపై ఎందుకు పీడీ యాక్టు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే పేరు చెప్పుతూ లాయర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదన్నారు. ఈ దాడి వెనుక కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. పోలీసులు అధికార బీఆర్‌ఎస్ నాయకులకు తొత్తులుగా పని చేస్తున్నారని విమర్శించారు. సూర్యాపేట ఎస్పీ, డీఎస్పీ, తుంగతుర్తి సీఐ, తిరుమలగిరి ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం తుంగతుర్తి బంద్‌కు బీఎస్పీ పిలుపునిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఆ పార్టీ అధికార ప్రతినిధులు జక్కని సంజయ్‌కుమార్, అరుణ క్వీన్, బొడ్డు కిరణ్, పిలుట్ల శ్రీనివాస్, బుడిగే మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 34మేకలు మృతి

గుండాల: పిడుగు పాటుకు మేకలు మృతిచెందాయి. ఈ ఘటన మండలంలోని తుర్కలశాపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పల సత్తయ్య, ఉప్పల లింగమల్లుకు చెందిన 34 మేకలపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. సుమారుగా రూ.3.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

తుర్కపల్లిలో బైక్ చోరీ

తుర్కపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. ఈ ఘటన తుర్కపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నక్షత్ర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ తన బైక్‌ను శుక్రవారం రాత్రి ఆస్పత్రి బయట పార్క్ చేశాడు. ఉదయం ఆస్పత్రి ముందు బైక్ లేకపోవడంతో చోరీకి గురైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

భువనగిరి : వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన భువనగిరిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అర్బన్‌నగర్‌కు చెందిన బండారి శంకర్ ఈ నెల 16న భార్యతో గొడవపడ్డాడు. అదే రోజు భార్య పట్టణంలోని రైతు బజార్‌కు వెళ్లింది. తిరిగి మధ్యాహ్నం 2గంటలకు ఇంటికి రాగా భర్త కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ కనిపించలేదు. దీంతో బాధితురాలు ఈ నెల 18న పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తేజంరెడ్డి శనివారం తెలిపారు.

పది నిమిషాల్లోనే సెల్‌ఫోన్ అప్పగింత

నార్కట్‌పల్లి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు పది నిమిషాల్లోనే గుర్తించి బాధితుడికి తిరిగి అప్పగించారు. ఈ ఘటన నార్కట్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం రత్తుపల్లి గ్రామానికి చెందిన లింగస్వామి చిట్యాల నుంచి నార్కట్‌పల్లికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పెట్రోలు బంక్ సమీపంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ సైదాబాబు ఆధ్వర్యంలో పోలీసులు లొకేషన్ ద్వారా 10 నిమిషాల్లోనే ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించారు. ఫోన్‌ను గుర్తించిన హెడ్ కానిస్టేబుల్ రమేష్‌ను అభినందించారు.

వందే భారత్ రైలులో వృద్ధుడికి గుండెపోటు

మిర్యాలగూడ అర్బన్: మనవరాలి పుట్టువెంట్రుకలు తీయించేందుకు తిరుపతికి వెళుతున్న వృద్ధుడు మార్గమధ్యలో గుండెపోటుతో మృతిచెందాడు. హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌కు చెందిన ప్రభాకర్ (72) తన మనవరాలు పుట్టు వెంట్రుకలు తీయించేందుకు కూతురు, అల్లుడితో కలిసి శనివారం వందేభారత్ ట్రైన్‌లో తిరుపతికి బయలుదేరారు. నల్లగొండ దాటిన తరువాత ఒక్కసారిగా ఛాతిలో నొప్పి వస్తుందని చెబుతూనే ప్రభాకర్ కుప్పకూలి పోయాడు. దీంతో తోటి ప్రయాణికులు అతడికి సీపీఆర్ చేశారు. అనంతరం రైల్వే అధికారులు మిర్యాలగూడ స్టేషన్‌లో సిబ్బందిని అలర్ట్ చేసి అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. మిర్యాలగూడలో వందే భారత్ ట్రైన్ స్టాప్ లేకున్నా స్పందించిన రైల్వే అధికారులు ట్రైన్‌ను నిలిపి వేశారు. ప్రభాకర్‌ను అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

- చింతూరు నుంచి షోలాపూర్‌కు తరలిస్తుండగా అడ్డగూడూర్ మండలంలో పట్టుకున్న పోలీసులు
- రూ.42.15 లక్షల విలువైన 232 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

చౌటుప్పల్ : గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.42.15 లక్షల విలువైన 232 కేజీల సరుకుతో పాటు బొలేరో వాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర కేసు వివరాలు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా బర్షి తాలూకాలోని ప్రిగ్రి గ్రామానికి చెందిన భజరంగ్ శ్రీరంగ్ కరాడే వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు తలెత్తడంతో డబ్బు సంపాదనకు అడ్డదారి వెతుక్కున్నాడు. అందులో భాగంగా తమ గ్రామానికే చెందిన డ్రైవర్‌లుగానే పని చేసే స్నేహితులైన సాగర్ శివాజీ వస్తుద్, సూయాష్ రాందాస్ సర్దేలను సంప్రదించాడు. అడ్డదారుల్లో డబ్బు సంపాదించుకుందామని చెప్పాడు. ఇందుకుగాను గంజాయిని అక్రమంగా రవాణా చేసే పథకాన్ని వివరించి వారిని ఒప్పించాడు. అలా వీరంతా కొంతకాలంగా గంజాయిని రవాణా చేస్తూనే ఉన్నారు.

స్వరాష్ట్రంలోనే విక్రయానికి ప్రాధాన్యం

నిందితులు గంజాయిని స్వరాష్ట్రంలో విక్రయించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆ ప్రకారంగా షోలాపూర్‌కు రవాణా చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా చింతూరుకు వెళ్లి 232కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దాన్ని 114ప్యాకెట్లుగా మార్చారు. వాటిని బ్యాగుల్లో నింపుకొని బొలేరో వాహనంలో లోడ్ చేశారు. అలా భద్రాచలం, మహబూబాబాద్, తొర్రూర్, తిరుమలగిరి, అడ్డగూడూరు, భువనగిరి, హైదరాబాద్ మీదుగా షోలాపూర్ వెళ్లేందు ముగ్గురు బయలుదేరారు. అందులో భాగంగా అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన బొలేరో వాహనాన్ని చూసిన పోలీసులు అనుమానంతో తనిఖీ చేయగా గంజాయి గుట్టురట్టయ్యింది. అప్రమత్తమైన పోలీసులు వాహనంలోని గంజాయి బ్యాగులను, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా నిందితులు తమ అక్రమ దందా వివరాలు చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.42.15లక్షలని పోలీసులు తేల్చారు. పట్టుబడిన నిందితులను నల్లగొండ జైలుకు తరలించారు. సమావేశంలో ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి, రామన్నపేట సీఐ మోతీరాం, చౌటుప్పల్, అడ్డగూడూరు, మోత్కూర్, ఎస్‌ఐలు అనిల్, ప్రభాకర్, ఉదయ్‌కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కేసులో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు.

ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేస్తూ...

భద్రాచలం సమీపంలో ఉన్న చింతూరులో సరుకును కొనుగోలు చేసేవారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబాబు, ఒడిషాకు చెందిన సుక్రాలను ఎంచుకున్నారు. అందులో భాగంగా నిందితుల్లో ఒకరైన సుయాష్‌రాందాస్ సర్దాకు చెందిన బొలేరో వాహనంలో సరుకును రవాణా చేస్తున్నారు. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా కొంతకాలంగా వ్యాపారాన్ని విజయవంతంగానే కొనసాగిస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- పండ్ల తోటల రైతులకు కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అఖిల సూచనలు

పాడి పంట

నడిగూడెం : ఉమ్మడి నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ఉద్యానవన పంటలకు పెట్టింది పేరు. దాదాపు 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. దీనిలో సుమారు 30 వేల ఎకరాలు మామిడి, నిమ్మ 10 వేల ఎకరాలు, ఇంకా మిగతా పంటలైన బత్తాయి, జామ, సపోట, ఆయిల్ పామ్, బొప్పాయి, కొబ్బరి, తదితర తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుత వేసవిలో ఈ పంటలపై అగ్ని ప్రమాదాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వాటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అగ్ని ప్రమాదాల వలన వీటికి సంబంధించిన పరికరాలు సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వీటి సంరక్షణకు రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అఖిల చెబుతున్న సలహాలు ,సూచనలు.



నడిగూడెం మండలం కరివిరాలలో దగ్ధమైన నిమ్మ తోట

- రైతులు తోటల మధ్యలో పాదులు, పరిసరాల్లో ఏడాది పొడవునా పూతకు వచ్చే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి.
- మొక్కలు, చెట్ల మధ్య అంతర సేద్యం చేయడంతో పాటు, దున్నాలి.
- బిందు, తుంపర సేద్యం పరికరాలను శుభ్రం చేసుకొని, వాటిని రోలర్ సహాయంతో లేటర్స్ చుట్టుకొని సంరక్షించుకోవాలి.
- తోటల చుట్టూ కంపచెట్లు, ఎండిన పొదలు, ఆకులు, అలములు, చెత్త, ఎండిన కొమ్మలు లేకుండా జాగ్రత్త వహించాలి.
- ఫెన్సింగ్ ఇనుకముళ్ల తీగ, జీవకంచెగా అవిసి, కరోండా (కలెంకాయలు), కిత్తనారలను తోట చుట్టూ పెంచుకోవాలి.
- ఎండిన ఆకులు, కొమ్మలు, పొదలు తదితరాలను వారానికి ఒకసారి ఎండాకాలం ఉదయం సమయంలో ఒకసారి శుభ్రం చేయాలి.
- లేత తోటలలో పాదుల్లో బొబ్బర్లు, జనుము, తదితర పంటలను సాగు చేసుకోవాలి.
- అన్ని తోటలలో చెట్ల పాదులలో బిందు సేద్యం ద్వారా నిరంతరం తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- రైతులు సమీప అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలి. ప్రమాదం సంభవిస్తే వెంటనే వారికి సమాచారం అందించి సకాలంలో తోటలను రక్షించుకోవాలి.